క్లుప్తంగా

కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం కంబదహాల్, మధ్యాహ్నం ఇనగండ్ల గ్రామ సచివాలయాల్లో ఏఓ రైతులతో సమావేశమయ్యారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏఓ రైతులతో కలిసి పరిశీలించారు. సంరక్షణ, ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను ఈ సందర్భంగా ఏఓ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేష్, భాస్కర్, సునంద వీఏహెచ్ శశిదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ముడుమాల ప్రజలతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఈఓఆర్డీ సందీప్ పేర్కొన్నారు. మండలంలోని ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల్లో జరుతుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మంగళవారం ఈఓఆర్డీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ వ్యక్తిగతంలోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బురాన్‌దొడ్డి విద్యార్థి

సి.బెళగల్: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నవీన్ ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థి నవీన్‌ను హెచ్‌ఎం నిర్మల వసంత కుమారితోపాటు ఉపాధ్యాయు లు అభినందించారు. 9వ తరగతి విద్యార్థి నవీ న్ ఈనెల 28న కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్ర తిభ కనబరిచాడని ఈ సందర్భంగా హెచ్‌ఎం తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరుగనున్న 68వ రాష్ట్ర రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీలో నవీన్ పాల్గొంటాడని పీఈటీ సత్యకుమార్ తెలిపారు.

టీఏసీ సభ్యుడిగా శ్రీనివాసులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రామానికి చెందిన చిట్టిబోయిన శ్రీనివాసులు టీఏసీ (టెలిఫోన్ అడ్వజరీ కమిటీ)సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు ప్రధాన కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో చిట్టిబోయిన శ్రీనివాసులును సహచరులు, స్నేహితులను అభినందించారు. బీఎస్ఎన్ఎల్ సేవల విస్తర్ణలో తమ వంతుగా సలహాలు సూచనలు ఇస్తామని శ్రీనివాసులు తెలిపారు.

సెల్ రీచార్జ్ విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ

పాణ్యం: సెల్ రీచార్జ్ విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన కొత్తూరయ్య తన సెల్‌కు రీచార్జ్ చేయమని నాగభరత్ దుకాణానికి వెళ్లాడు. నెట్‌వర్క్ సమస్యతో రీచార్జ్ ఆలస్యమైంది. ఇంకా ఎందుకు కాలేదని దుకాణదారుడిని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. సాయంత్రం కొత్తూరయ్య కుమారుడు వచ్చి ఉదయం రీచార్జ్ చేయకుండానే మా నాన్నతో కొట్లాడావని నాగభరత్‌తో వాదులాడాడు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సొంతింటి ఆశలపై 'కూటమి' నీళ్లు

- ఆరునెలల్లో పూర్తి చేయాలంటూ టీడీపీ సర్కార్ షరతులు
- 'మన ఇల్లు..మన గౌరవం' పేరుతో ప్రభుత్వం హడావుడి
- ఇంటి పట్టా రద్దు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులు
- అయోమయంలో లబ్ధిదారులు

దశ	లేఅవుట్ స్థలం	సొంత స్థలం	మొత్తం
బీబీఎల్	20	64	84
బీఎల్	636	17	653
ఎల్ఎల్	67	09	76
ఆర్ఎల్	33	09	44
ఆర్‌సీ	13	05	18
పూర్తి	371	592	963
అన్ని దశల్లో	1843		



ఓర్వకల్లులో హౌసింగ్ లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు



ఉప్పలపాడులో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

ఓర్వకల్లు: పేదల సొంతింటి కలలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తే..కూటమి ప్రభుత్వం షరతులు విధిస్తుంది. పేదల సొంతింటి ఆశలపై నీళ్లు చల్లుతుంది. 'మన ఇల్లు..మన గౌరవం' పేరుతో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్పా లబ్ధిదారులకు ఏ మాత్రం భరోసా కల్పించడం లేదు. ఇప్పటికే గృహ నిర్మాణాలు చేపట్టి, అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్లను మార్చిలోపు పూర్తి చేయకపోతే రద్దు చేస్తామని షరతులు విధించడంతో లబ్ధిదారులను ఆందోళన చెందుతున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్యలు చేపట్టకపోగా.. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తవారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పడంలో రాజకీయ కోణం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– గత ప్రభుత్వంలో విస్తృతంగా ఇళ్ల నిర్మాణాలు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగింది. అర్హులైన ప్రతిఒక్కరూ పట్టాలతోపాటు గృహాలను మంజూరు చేసింది. 2021లో మండల వ్యాప్తంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు బ్రాహ్మణపల్లె, శకునాల, హుసేనాపురం, కొమరోలు, కన్నమడకల, ఓర్వకల్లు, కేతవరం, నన్నూరు, మీదివేముల, ఉప్పలపాడు గ్రామాలలో మొత్తం1,843 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇందులో హౌసింగ్ లేఅవుట్ల కింద 1,145, సొంత స్థలం కింద 698 మంది చొప్పున పేదలకు సొంతిళ్లు మంజూరు అయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు, పొదుపు మహిళలకు అదనంగా బ్యాంకుల నుంచి రూ.35 వేలు, మరో రూ.20 వేలు ఉపాధి పథకం కింద వర్తించేలా ఏర్పాటు చేశారు అధికారులు. ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు, ఇసుక, ఇనుపకడ్డీలు, సిమెంటును అందుబాటులోకి తెచ్చింది గత ప్రభుత్వం. మండలంలో 963 గృహాలు మాత్రం వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ లెక్కన దాదాపు రూ. 22 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఎంతో మంది సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. జగనన్న కాలనీలు సర్వాంగ సుందరంగా మారాయి. విద్యుత్, తాగునీటి వసతి కల్పించడమేగాక, అంతర్గత గ్రావేల్ రోడ్లు నిర్మించారు. తద్వారా జగనన్న కాలనీలు ఊళ్లను తలపిస్తున్నాయి. సీసీ రోడ్లు వేయాలనే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. గృహనిర్మాణాల విషయంలో ఓర్వకల్లు మండలం జిల్లాలోనే అగ్రస్థానం దక్కించుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మూడు సెంట్ల ఇంటి స్థలాల పంపిణీ ఏదీ!

ఎన్నికల ముందు టీడీపీ కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలుకు నోచుకోలేదనే పేదలు బహిరంగంగానే విమర్శస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని టీడీపీ నాయకులు గొప్పలు చెప్పిన విషయం తెలిసిందే. ఇళ్ల నిర్మాణాలకు ఏకంగా రూ.4 లక్షల మంజూరు చేస్తామని చెప్పిన టీడీపీ కూటమి నాయకులు ఆ విషయంపై కనీసం మాట్లాడడం లేదు. టీడీపీ కూటమి సర్కార్ కొలువుదీరి వంద రోజులు గడిచినా ఇంటి స్థలం కోసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదని పేదలు విమర్శలు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన గృహనిర్మాణాలు ఎందుకు నిలిచిపోయాయి... పేదలు తమ ఇళ్లను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం తరపున చేయాల్సిన సాయం విషయాన్ని మరిచి గడువులోపు నిర్మించుకోకుంటే రద్దు చేస్తామని అధికారులు హుకుం జారీ చేయడం ఎంతవరకు న్యాయమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం చిత్తశుద్ధితో పనిచేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శలు వస్తున్నాయి. కేవలం మన ఇల్లు..మన గౌరవం పేరుతో లేఅవుట్ల వద్ద లబ్ధిదారులు, అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రతి శనివారం సమావేశాలు ఏర్పాటు చేయడంపై పేదలు పెదవి విరుస్తున్నారు. ఏవిధమైన ఆర్థిక ప్రయోజనం కల్పించని ఈ సమావేశాలు ఎందుకని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు.

గడువులోపు గృహాలు నిర్మించుకోవాలి



గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని 10 గ్రామాలలో హౌసింగ్ లేఅవుట్ కింద 1,145 మంది, సొంత స్థలం కింద 698 మంది కలిపి మొత్తం 1845 మందికి ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. అందులో ఇప్పటి వరకు 963 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం చేస్తున్నారు. మిగతావి వివిధ నిర్మాణ దశలో నిలిచి పోయాయి. ఈ ఇళ్లను వచ్చే మార్చినాటికి పూర్తి చేసుకోవాలి. గడువు తర్వాత నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు నిలిపేయడం జరుగుతుంది.

–రామయ్య, ఏఈ హౌసింగ్, ఓర్వకల్లు

నేడు మాంసం విక్రయిస్తే చర్యలు

కర్నూలు (రూరల్): అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మాంసం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ధనుంజయ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిమాంసం విక్రయాలు జరిపినా హోటళ్లలో మాంసాహారం వడ్డించినా కేసులు నమోదు చేస్తామన్నారు.

సన్మానం



ఏపీఎం వెంకటస్వామిని సన్మానిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తూ, కర్నూలులో డీఆర్‌డీఏ హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయిన ఏపీఎం వెంకటస్వామిని మంగళవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, సి.బెళగల్ కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు ఏపీఎం వెంకటస్వామి చేసిన సేవలను కొనియాడారు.

జేఎన్‌టీయూ జట్టుకు విద్యార్థులు ఎంపిక

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ మంగళవారం తెలిపారు. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ జోజిరెడ్డి హాజరయ్యారన్నారు. జేఎన్‌టీయూ పరిధిలోని 30కళాశాల నుంచి 139మంది క్రీడాకారులు హాజరయ్యారని, వచ్చేనెల కేరళలో జరిగే సౌత్‌జోన్ క్రీడల్లో జేఎన్‌టీయూ తరుపున క్రీడాకారిణులు పాల్గొంటారన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయండి

గడివేముల: మట్టి పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేయాలని, అప్పుడే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు.మండల పరిధిలోని ఒండుట్ల, పైబోగుల గ్రా మాల్లో మంగళవారం ఏఓ పొలం పిలుస్తోంది కా ర్యక్రమం నిర్వహించారు. కొర్ర, కంది పంటలను పరిశీలించిన ఏఓ రైతులకు సూచనలు చేశారు. అనంతరం మట్టి పరీక్షల ఫలితాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ తదితరులు పాల్గొన్నారు.



మట్టి పరీక్షల ఫలితాలను రైతులకు అందజేస్తున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

300 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరు

మండలానికి 300 సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు మంజూరైందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. జేజీ-11 రకం క్వింటాం రూ.9,400 ఉండగా 25 శాతం సబ్సిడీతో రూ.7,050 రైతులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కర్నూలు (రూరల్): కల్లూరులోని అర్బన్ 34వ వార్డు నిర్మల్ నగర్‌లో, సల్కాపురం గ్రామంలో సోమవారం జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి హాజరయ్యారు. లబ్ధిదారులకు ఆమె పింఛన్ సొమ్ము అందజేశారు. కర్నూలు మండల పరిధిలోని పి.రుద్రవరంలో మంగళవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 6,313 మంది లబ్ధిదారులు ఉండగా 6,188మందికి నగదు అందజేశామని చెప్పారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోపాటు గ్రామాల్లో మంగళవారం పింఛన్ పంపిణీ చేశామని ఎంపీడీఓ రాముడు తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీఈఓలు, వీఆర్ఏలు, వెలుగు సీసీలు, జూనియర్ లైన్‌మెన్‌లు పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేశారన్నారు.

ఫుట్‌బాల్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

కర్నూలు (టౌన్): ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని, దిగ్గజ క్రీడాకారులు మెస్సీ, రోనాల్డోను ఆదర్శంగా తీసుకొని ప్రతిభ చాటాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ క్రీడాకారులకు సూచించారు. నగర శివారులోని లక్ష్మీపురం రిడ్జ్ పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్‌సీ క్లస్టర్-7 ఫుట్‌బాల్ పోటీలు మూడు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. మంత్రి టీజీ భరత్ అతిథిగా హాజరై ఫుట్‌బాల్‌ను కిక్ కొట్టి క్వార్టర్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కేంద్ర క్రీడల మంత్రితో మాట్లాడి కర్నూలు నగరంలో జాతీయస్థాయి వసతులతో రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టేడియం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ మోహన్‌కుమార్ మాట్లాడారు. రిడ్జ్ సీఈఓ జి.గోపినాథ్, టోర్నమెంట్ కార్యదర్శి రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

పోటీల వివరాలు

మంగళవారం జరిగిన పోటీల్లో కృష్ణా జిల్లా షామ్‌రాక్ స్కూల్ జట్టుపై 1-0 గోల్స్‌తో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టు విజయం సాధించింది. పెనాల్టీ షూటౌట్‌లో 2-0 గోల్స్‌తో ఎడిపై వరల్డ్ స్కూల్ జట్టుపై సమ్రతా స్కూల్ జట్టు, ఖమ్మంకు చెందిన నవభారత్ స్కూల్ జట్టుపై హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్ స్కూల్ జట్టు గెలుపొందాయి. అనంతపురం ది వెరిడియన్ స్కూల్ జట్టుపై 2-0 గోల్స్‌తో తెలంగాణకు చెందిన సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్ జట్టు, అలాగే అండర్-17 విభాగంలో చిత్తూరుకు చెందిన వెరిటాస్ సైనిక్ స్కూల్ జట్టుపై 5-0 గోల్స్‌తో విశాఖపట్నంకు చెందిన నేవీ చిల్డ్రన్ స్కూల్, హైదరాబాద్‌కు చెందిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ జట్టుపై సమస్తి ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది.

ప్రయాణికుడు మృతి



మృతి చెందిన అక్బర్‌బాషా

పాణ్యం: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన అక్బర్‌బాషా (46) తెలంగాణ ఆర్టీసీ బస్సులో మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాల మేరకు అక్బర్ బాషా ఆళ్లగడ్డలో టైలర్‌గా పని చేస్తు జీవనం సాగిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో టైలరింగ్ చేసేందుకు వెళ్లారని, అయితే ఇంటికి వచ్చేందుకు హైదరబాద్‌లో సంగారెడ్డి డిపోకు చెందిన బస్సులో ప్రయాణమయ్యాడు. కర్నూలు వద్ద రాగానే అక్బర్‌బాషా భోజనానికి బస్సు ఎక్కడ ఆపుతారని సిబ్బందిని అడగ్గా పాణ్యంలో అని చెప్పారన్నారు. పాణ్యం వద్దకు రాగానే అక్బర్‌బాషాలో స్పందన లేకపోవడంతో తోటి ప్రాయాణికులు సిబ్బందికి తెలియజేశారు. వారు పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అక్బర్‌బాషా సెల్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బస్సును అలాగే ఆళ్లగడ్డకు పంపించారు. మృతుడికి భార్య చికిలాబీ, కుమార్తె, కొడుకు సంతానం ఉన్నట్లు తెలిపారు.

సమయ పాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్:గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు.రికార్డులను,సిబ్బంది హాజరు,మూ మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కొందరు గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన : ఎంపీడీఓ చంద్రశేఖర్ మండలంలోని వెంకటగిరి, అమడగుంట్ల గ్రామాల్లో పర్యటించారు. లబ్ధిదారులకు సిబ్బంది అందజేస్తున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. సాయంత్రంలోగా వందశాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రబీ సీజన్‌కుగాను ప్రభుత్వం మండలానికి 2,200క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలను మంజూరు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని వర్కూరు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, కంది, ఆముదం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ రైతులకు వివరించారు. 25శాతం సబ్సిడీ పోను, రైతుకు క్వింటాం శనగలకు రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఈఓఆర్డీ ఆగ్రహం



ఈర్లదిన్నె సచివాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామ సచివాలయ ఉద్యోగులపై ఈఓఆర్డీ సందీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఈర్లదిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేసిన ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ఈఓఆర్డీ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పులు పునరావృత్తం అయితే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

స్పందించిన విద్యుత్ అధికారులు



స్టీల్ ప్లాంట్ స్తంభాన్ని సరి చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

పాణ్యం: విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయంటూ సెప్టెంబర్ 30న ప్రచురించిన ''పొంచిఉన్న ప్రమాదం' శీర్షికపై విద్యుత్ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఒరిని స్టీల్ ప్లాంట్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది సరిచేశారు. అదేవిధంగా కిందకు వేలాడుతున్న వైర్లను సరి చేసి రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు.

వృద్ధులు ఆహార నియమాలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమలత,



వృద్ధులకు వైద్య చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(రూరల్): ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధులు ఆహారపు నియమాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిస్ట్రిక్ స్కూల్ హెల్త్‌ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత సూచించారు. మండలంలోని మిలటరీ కాలనీలో మంగళవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి వృద్ధులు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే వైద్యుల సూచనల మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్యాన్ని కూడా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డెమో ఆఫీసర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుమలత, ఎమ్‌పీహెచ్ఓ వెంకటరమణ, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, హెల్త్ సూపర్ వైజర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి

కోడుమూరు రూరల్ : అరవైఏళ్లు పైబడిన వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని కోడుమూరులోని స్నేహ వృద్ధాశ్రమంలో వైద్య సిబ్బంది వృద్ధులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డా.మదన్‌శేఖర్ మాట్లాడుతూ చిన్న చిన్న అనారోగ్య సమస్యలున్నా వృద్ధులు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సుభాషిణి, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో వైద్య పరికరాల ప్రారంభం



గైనిక్ విభాగంలో వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో మంగళవారం సీటీజీ ఫీటల్ మానిటర్స్, ఓటీ టేబుల్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికాలోని చికాగోలో నివసిస్తున్న 1962, 1963 బ్యాచ్‌కు చెందిన కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణారెడ్డి, అరుణ దంపతులు వారి మాతృమూర్తి పెన్నబడి గంగులమ్మ జ్ఞాపకార్థం రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి విరాళంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా గైనిక్ విభాగంలో బీటీ-350 సీటీజీ మానిటర్లు రెండు, ఓటీ టేబుల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. సీటీజీ మానిటర్స్ ద్వారా గర్భిణులకు కాన్పు సమయంలో శిశువు గుండె పనితీరును పర్యవేక్షిస్తూ ప్రసవం చేయడం వల్ల మాతాశిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ఓటీ టేబుల్ ద్వారా ల్యాప్రోస్కోపీ చేసేటపుడు వివిధ పొజిషన్‌లకు ఉపయోగించడం వల్ల రోగులకు సంబంధించి క్లిష్టమైన చికిత్సలు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. త్వరలో గైనిక్ విభాగంలో ఇన్‌ఫెర్టిలిటీ క్లినిక్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందులో ల్యాప్రోస్కోపీ, వైద్యపరీక్షలు చేయడానికి అల్ట్రాసౌండ్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఆన్ టేబుల్ అల్ట్రాసౌండ్ మిషన్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు సావిత్రి, శ్రీలత, స్నిగ్ధ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ డాక్టర్ హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: సబ్సిడీ శనగ విత్తనాల కోసం ఈ నెల 3వ తేదీ నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సుధాకర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల గ్రామాలలో సాగు చేసిన పత్తి, ఆముదం, వరి పంటలను ఏఓ పరిశీలించారు. పంటలను ఆశించి శీతాకాల తెగుల్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ రైతులకు తెలియజేశారు. అనంతరం ఆయా రైతు సేవా కేంద్రాలలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఏఓ సుధాకర్ మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి శనగ విత్తనాలు అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మార్కెట్‌లో క్వింటాం శనగ రూ.9,400 ఉండగా 25 శాతం సబ్సిడీపోను రైతులు రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రైతులు లక్ష్మికాంతారెడ్డి, సుధాకర్‌రావు, ఏఈఓలు మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.